క్లుప్తంగా

పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

సింహాచలం: ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఆప్షన్ ఎంచుకున్న విద్యార్థులు శనివారం నుంచి కళాశాలలో ప్రవేశాలకు తరలి వస్తున్నారు. వారి సర్టిఫికెట్లను కళాశాల అధ్యాపకులు పరిశీలించారు. తొలిరోజు శనివారం మెకానికల్‌లో 14మంది, సివిల్‌లో 14మంది, ట్రిపుల్‌ఈలో 22మంది, ఈసీఈలో 28 మంది చేరారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలోని స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

బీసీల అభ్యున్నతికి కృషి



బంధం పైడిరాజు

పరవాడ: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి రావాడ గ్రామానికి చెందిన బంధం పైడిరాజును ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు పంచగ్రామాల సమస్యపై ధర్నా

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆదివారం వేపగుంట జంక్షన్‌లో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో పంచగ్రామాల్లోని రైతులు, ప్రజలు, నిర్వాసితులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఉక్కు' అమ్మకం ప్రతిపాదన విరమించుకోవాలి



దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక శక్తికి తలవంచి విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 919వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్వాసితులకు, కార్మికులు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కళాభారతిలో నేడు వీణ కచేరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో కళాభారతి మద్దిలపాలెంలో ఆదివారం అమెరికాకు చెందిన అమృత వర్షిణి అచెల్లచే వీణావాదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వీఎంఏ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మర్రిపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం సకాలంలో పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని బోదువలస సచివాలయం పరిధిలోని మర్రిపాలెం,ఎల్లుప్పి గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లక్షలాది రూపాయిలు అందిస్తూ పేదలకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని గణాంకాలతో సహా ఆయా కుటుంబాలకు వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఓటీఎస్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో పాటు పట్టాలు ఆయన అందజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మర్రిపాలెం గ్రామంలో పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాలు మార్చాలని ఏఈ వీరేంద్రను ఆదేశించారు.అలాగే పలు చోట్ల లోతట్టుగా ఉన్న సీసీ రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. సత్వరమే పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, సర్పంచ్ ఉగ్గిన దేవుడమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఉగ్గిన గంగునాయుడు,బుదిరెడ్ల రామకృష్ణ,కోన సంజీవరావు, దొగ్గ దేముడు, పార్టీ మండల కన్వీనర్ యడ్ల నాయుడుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు



జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్న హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదిన్

పరవాడ: జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ మైదిన్ సూచించారు. మండలంలోని వెన్నలపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించి కాలనీలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ నెల 30న జగనన్న కాలనీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని కాలువలు, రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. త్వరితగతిన మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ ముఖద్వారం వద్ద రూ.6 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఆర్చి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ హెచ్‌డీఈ ప్రసాద్, డీఈ రాజు, ఏఈ కె.ఎస్.ఎన్.రెడ్డి, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ, పంచాయతీరాజ్ ఏఈ జి.రామారావు, పరవాడ, వెన్నలపాలెం పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, వరలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పెందుర్తి నూకాంబిక ఆలయంలో చోరీ

- 40 తులాల వెండి వస్తువుల అపహరణ

సింహాచలం: పెందుర్తి నూకాంబిక అమ్మవారి ఆలయంలో శనివారం చోరీ జరిగింది. ఉదయం 10.30 గంటల సమయంలో ఆలయానికి 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నాడు. అనంతరం ఉత్సవమూర్తి వెండి కిరీటం, వెండి పంచపాత్ర, వెండి పళ్లెం దొంగిలించి సంచిలో పెట్టుకుని వెళ్లిపోయాడు. ఆ సమయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నా గమనించలేదు. ఈ విషయంపై రాత్రి పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయానికి వచ్చిన క్రైం ఎస్ సల్మాన్ బేగ్ పరిశీలన జరిపారు. సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆభరణాలు దొంగిలించిన వ్యక్తి పలుమార్లు ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు వచ్చినట్టు గుర్తించారు. అతనికి మతి స్థిమితం కూడా లేదని చెబుతున్నారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పాఠశాల భవనం ప్రారంభం

స్థలదాతను అభినందించిన ఎమ్మెల్యే



పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: పాఠశాల నిర్మాణానికి గ్రామానికి చెందిన బుదిరెడ్ల రామకృష్ణ తన కుమారుడి సాయిరాజ్ జ్ఞాపకార్థం స్థలం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అన్నారు.మండలంలోని బుదిరెడ్లపాలెం గ్రామంలో రూ.12 లక్షల ఎన్‌ఎఫ్‌సీఎల్ నిధులతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయిరాజ్ మనందరిలో ఒకడిగా ఉంటూ ప్రమాదవశాత్తు మరణించడం దురదృష్టకరమన్నారు.దీనితో ఆయన జ్ఞాపకార్థం తన తండ్రి రామకృష్ణ గ్రామంలోని ప్రజల సహకారంతో గుడి,బడిని నిర్మించాలనుకున్నారని తెలియజేసారు. ప్రారంభించిన ఆరునెలల్లోనే నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, నాయకులు కొటాన రాము, గ్రామ పెద్దలు బుదిరెడ్ల రామకృష్ణ,బుదిరెడ్ల కనకరాజు,కోన సంజీవరావు, దొగ్గ దేముడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఎంఈవోలు లక్ష్మణరావు,సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల అభ్యున్నతి కృషి



హర్షం వ్యక్తం చేస్తున్న గొర్లె రామునాయుడు, విశ్వకర్మ కమ్యూనిటీ ప్రతినిధులు

సింహాచలం: విశ్వకర్మ సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ పీఎం వీకేవై ప్రవేశపెట్టడం శుభదాయకమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త గొర్లె రామునాయుడు అన్నారు. ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో శనివారం పెందుర్తి బీజేపీ కార్యాలయంలో విశ్వకర్మ నాయకుల సమావేశం నిర్వహించారు. పలువురు బీజేపీలో చేరారు. గొర్లె రామునాయుడు మాట్లాడుతూ విశ్వకర్మ యోజనకు రానున్న రూ.17వేల కోట్లు ప్రకటించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి బీజేపీ అధ్యక్షుడు ద్వారంపూడి పరమేశ్వరరావు, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, అనకాపల్లి జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ చదరం నాగేశ్వరరావు, కాళ్ల జగన్‌మోహన్‌రావు, విశ్వకర్మ కమ్యూనిటీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేష్, జనరల్ సెక్రటరీ అచ్చెంనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి శనివారం పర్యటించారు. అసకపల్లిలో నిర్మాణంలోఉన్న రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అసకపల్లి శివారు యర్రవానిపాలెంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో పలు ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో మండల పరిషత్ ఏవో ఎస్.బాబూరావు, ఈవోఆర్‌డీ మహేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ,పంచాయతీ రాజ్ ఏఈ అర్జున అప్పారావు,ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ వావా



మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా

డాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నేతలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార (విశాఖ ఉత్తర) : నర్సింహనగర్‌కు చెందిన సీపీ అవధాని ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి నాగుపాము (స్పెక్టికల్ కోబ్రా) చొరబడింది. వంట గదిలోని పోపుల డబ్బాల మధ్య ఇమిడి ఉన్న ఆ పామును శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో చూసి అవధాని కుటుంబ సభ్యులు భయాందోళనకు లోనయ్యారు. వెంటనే గాజువాకలోని స్నేక్ కిరణ్‌కు సమాచారం అందజేశారు. అతను హుటాహుటిన వచ్చి చాకచక్యంగా నాగుపామును బంధించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్నేక్ కిరణ్ మాట్లాడుతూ పాములు ఇళ్లలో, కార్యాలయాల్లో చొరబడినప్పుడు భయపడకుండా, 88663-68899 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సులు

ఏయూక్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సుల నిర్వహించాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు అన్నారు. ఏయూ హిందీ విభాగంలో హిందీ సాహిత్య నిర్మాణంలో మాండలీల భాష రూపాల పాత్ర అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరభారత దేశం నుంచి హిందీ భాష శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో ఆచార్య అర్జున్ పాండే, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షులు ఆచార్య యస్.ఎం ఇక్బాల్, ఆచార్య సీతాలక్ష్మి, ఆచార్య సూరప్పడు, ఆచార్య అరుణ్‌కుమార్ మిశ్ర, సంకల్ప్ సాహితీ సంస్థ అధ్యక్షుడు దినకర్, డాక్టర్ కె.శాంతి, డాక్టర్ ఎస్.కృష్ణబాబులు పాల్గొని ప్రసంగించారు. హిందీ కవిసమ్మేళనంలో డాక్టర దీపా గుప్త, సుధా కుమారి జుహి, శివమ్ తివారి, శాంతి మిశ్ర గుంజన్, జయ్ ప్రకాష్‌సింగ్, ఉజ్వల్ గోయల్‌లు తమ కవితలతో శ్రోతలను రంజింపజేశారు. కార్యక్రమంలో ఆచార్య వై.వెంకట లక్ష్మి, విజయభారతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విశాఖ హిందీ పరిషత్, అవధీ సాహిత్య సంస్థాన్ సంయుక్తగా నిర్వహించాయి. అనంతరం అతిథులను సత్కరించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి

పంచాయతీ వార్డు మెంబర్ల స్థానాలకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. టీడీపీ మద్దతుదారులపై భారీ మెజార్టీతో విజయం సాధించారు.



ఎన్నిక ధ్రువ పత్రం చూపిస్తున్న అప్పారావు, పక్కన ఎంపీటీసీ శ్రీనివాసరావు



దేవుడమ్మకు ధృవీకరణ పత్రం అందజేస్తున్న ఆర్‌వో సువర్ణ, చిత్రంలో గొరపల్లి సర్పంచ్ శ్రీను

సింహాచలం: పెందుర్తి మండలంలోని గొరపల్లి పంచాయతీ నాలుగో వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన తంగేటి దేవుడమ్మ భారీ మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 244 మంది ఓట్లకు 174 పోలయ్యాయి. ఇందులో దేవుడమ్మకు 149 ఓట్లు రాగా టీడీపీ బలపరిచిన అభ్యర్థి వనం చిన్నాకు కేవలం 25 ఓట్లు మాత్రమే వచ్చాయి. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరిగింది. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. విజయం సాధించిన దేవుడమ్మకి రిటర్నింగ్ అధికారి సువర్ణ ధృవీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, బి.ముకుందరావు,టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద పెందుర్తి ఇన్‌చార్జి సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత బందోబస్తు నిర్వహించారు.

కన్నూరులో..

పరవాడ: మండలంలోని కన్నూరు పంచాయతీలో 7వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి మడక అప్పారావు 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వార్డు పరిధిలో 192 ఓట్లకు 158 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మడక అప్పారావుకు 96 ఓట్లు రాగా ప్రత్యర్థికి 62 ఓట్లు పోలయ్యాయి. ఉప ఎన్నికల్లో విజయం సాధించిన అప్పారావును ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి నాగమణి, పార్టీ నాయకులు అభినందించారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆర్చి ఏర్పాటుకు శంకుస్థాపన



వెన్నలపాలెం జగనన్న లేఅవుట్ వద్ద ఏర్పాటు చేయనున్న ఆర్చికి భూమి పూజ చేసిన ఎంపీపీ

పరవాడ: వెన్నలపాలెం జగనన్న లేఅవుట్ వద్ద రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆర్చి(ముఖ ద్వారం) నిర్మాణానికి శనివారం ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు శంకుస్థాపన చేశారు. ఆర్చి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, పరవాడ, వెన్నలపాలెం ఉప సర్పంచ్‌లు బండారు రామారావు, వెన్నల సన్యాసిరావు, గృహ నిర్మాణశాఖ డీఈ రాజు, ఏఈ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ జి.రామారావు, ఆర్‌ఈసీఎస్ ఏఈ శేషసాయి, నాయకులు ఆర్.శ్రీనివాసరావు, ఎం.ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

కెమెరా కన్నులో చరిత్ర పదిలం

- స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్
- స్టీల్‌హౌస్‌లో ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



అవార్డులందుకున్న ఫొటోగ్రాఫర్లతో సీఎండీ, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు

ఉక్కునగరం: కెమెరా కన్నుల్లో బంధించిన చిత్రాలు చరిత్రను చిరకాలం భద్రపరుస్తాయని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ, స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా స్టీల్‌ప్లాంట్ ఉక్కు హౌస్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలోని చిత్రాలను ఆయన తిలకించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ప్రారంభం, నిర్మాణ దశ నాటి చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో 1940 నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న వివిధ కెమెరాలను ప్రదర్శించారు. వాటిని సీఎండీ పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్ల రాజారావు, సి.వి. సుబ్రమణ్యం, ఎస్.వి.వి.ఎస్. ప్రసాద్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీసీ విభాగం జీఎం ఆర్.పి. శర్మ, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు పి.ఎస్.సేథ్, వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు సత్కారం



యూఎస్‌లో చదువుకు ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న రూపావతి తదితరులు

ఎంవీపీకాలనీ: విదేశీ చదువులకు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపిక వారి ప్రతిభకు నిదర్శమని విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయాధికారిని ఎస్.రూపావతి అన్నారు. ఇటీవల 'ద కెన్నడి- లూథర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాంలో భాగంగా యూఎస్ చదువుకు ఎంపికైన కొమ్మాది గురుకుల పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఆర్.ఇవానింజలి, ఎస్.జ్ఞానేశ్వరరావుల సత్కార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇందులో వెలకట్టలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.